క్లుప్తంగా

ఓటర్ల తుదిజాబితా ప్రదర్శన



ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న తహసీల్దార్ బాలమురళీకృష్ణ

సాలూరు: ఓటర్ల తుదిజాబితాను తహసీల్దార్ బాలమురళీకృష్ణ సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శించారు. సాలూరు పట్టణం, మండలంలో 2,01,441 మంది ఓటర్లు ఉండగా అందులో 98,189 మంది పురుషులు,1,03,248 మంది మహిళలు, నలుగురు ఇతరులు ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ భానుప్రసాద్ పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం రూరల్ సీఐగా కె.రవికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇప్పటి వరకు రాజాం టౌన్ సీఐగా విధులు నిర్వహించారు. ఇప్పటివరకు రూరల్ సీఐగా విధులు నిర్వహించిన స్వామినాయుడు అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా బదిలీపై వచ్చిన నూతన సీఐ రవికుమార్ మాట్లాడుతూ పార్వతీపురం పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేపీఎస్ జిల్లా పర్యవేక్షణాధికారి, స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్

పార్వతీపురంటౌన్: ఆరోగ్యశ్రీ కార్డులను అర్హుందరికీ వెంటనే పంపిణీ పూర్తి చేయాలని జేపీఎస్ జిల్లా పర్యవేక్షణాధికారి, స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ అన్నారు. డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు ఆధ్వర్యంలో ప్రోగ్రాం అధికారులకు సోమవారం నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. మండలాలు, సచివాలయాల వారీగా ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ నివేదికలను ఆయన పరిశీలించి ఎక్కువగా పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల్లో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలో పర్యవేక్షణ చేయాలని ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్యశ్రీ రిఫరల్స్‌కు వెంటనే సంబంధిత ఆస్పత్రిలో చికిత్స పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీతంపేట, పార్వతీపురం డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ విజయపార్వతి, డాక్టర్ శివకుమార్, డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, డీఎల్ఏటీఓ శ్యామ్‌కుమార్, ఏపీడీపీ నోడల్ అధికారి వినోద్‌కుమార్, ప్రోగ్రాం అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఎరువుల షాపులో రికార్డులు తనిఖీ చేస్తున్న పాలకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు రత్నకుమారి

గరుగుబిల్లి: ఎరువుల షాపు యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పాలకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి హెచ్చరించారు. సోమవారం మండలంలోని సంతోషపురం గ్రామపంచాయతీ, ఖడ్గవలస జంక్షన్‌లోని శ్రీగాయత్రి ఎరువుల షాపులో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో పేర్కొన్న వివరాలకు, షాపులో ఉన్న యూరియా నిల్వలకు వ్యత్యాసం ఉండడంతో రూ.లక్ష విలువైన యూరియాను సీజ్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన ధరల కన్నా అధికంగా ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. దుకాణంలో ధరల పట్టికను అందుబాటులో ఉంచాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోతే షాపు అనుమతులు రద్దు చేయడం జరుగుతుందన్నారు. ఆమె వెంట ఏవో ఆర్.విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె వీడి విధుల్లో చేరిన అంగన్‌వాడీలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఇద్దరు అంగన్‌వాడీ కార్యకర్తలు, మరో ఇద్దరు ఆయాలు సమ్మె వీడి, సోమవారం విధుల్లో చేరినట్లు ఐసీడీఎస్ పీవో సుశీలదేవి తెలిపారు. అంగన్‌వాడీలంతా తమ డిమాండ్ల పరిష్కారానికి 40 రోజులుగా సమ్మె చేస్తుండగా, విధుల్లో చేరని వారి ఖాళీల భర్తీకి ఈ నెల 25వ తేదీన నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు ప్రకటించడంతో వీరు విధుల్లో చేరుతున్నట్లు తెలిపారని ఆమె అన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



బలిజిపేట: గొల్లవీధి రామాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు



పార్వతీపురం టౌన్: సీతారామ లక్ష్మణుల విగ్రహాలతో శోభాయాత్ర



పాచిపెంట: మండల కేంద్రంలో చేస్తున్న బైక్‌ర్యాలీ



పార్వతీపురం: సంగంవలసలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



సీతానగరం మార్కెట్‌లో వందలాది మంది భక్తులతో జరుగుతున్న శోభాయాత్ర.

బలిజిపేట: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా బలిజిపేట మండలంలోని రామాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని అలంకరించి తెల్లవారుజామునుంచి ధూప, దీప నైవేద్యాలతో పూజలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వామివారికి పూజలు, భజనలు జరిగాయి. అందులో భాగంగా బలిజిపేటలోని గొల్లవీధి రామాలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

సీతారామ లక్ష్మణ విగ్రహాలతో శోభాయాత్ర

పార్వతీపురంటౌన్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జిల్లా కేంద్రంలో పలు చోట్ల భక్తులు సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. ఈ మేరకు స్థానిక వైకేఎం కాలనీ, బెలగాం రామాలయం, మేదర వీధి రామాలయం, సారికి వీధి రామాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మామిడి తోరణాలు వివిధ రకాల పూలతో ఆలయాలను అందంగా అలంకరించారు. పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి వైకేఎం కాలనీ వరకు భక్తులు సీతారామ లక్ష్మణుల విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించి భక్తిని చాటుకున్నారు. జై శ్రీరామ్ నామస్మరణతో పట్టణం మార్మోగింది.

మార్మోగిన జై శ్రీరామ్ నినాదం

పాచిపెంట: మండలంలోని జై శ్రీరామ్ నినాదం మార్మోగింది. అయోధ్య రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలోని శివాలయం నుంచి అభయాంజనేయ స్వామి ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.అనంతరం ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా శోభాయాత్ర

పార్వతీపురం: అయోధ్యలో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైన వేళ మండలంలోని సంగంవలస, ఎమ్మార్‌నగరం, చినబొండపల్లి, వెంకంపేట తదితర గ్రామాల్లో శ్రీ రామ శోభాయాత్రను వైభవంగా సోమవారం నిర్వహించారు. అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో మంగళ వాయిద్యాలు, మేళ తాళాలతో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు ఈ కార్యక్రమంలో అధికంగా పాల్గొన్నారు. అలాగే కోలాటం ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

సమావేశం విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు



హాజరైన నాయకులు, కార్యకర్తలు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: ఈనెల 27న విశాఖపట్నం జిల్లా భీమిలిలో సీఎం జగన్ మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర వైఎస్సార్‌సీపీ శ్రేణులతో నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మంటపంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సన్నద్ధత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్ రెడ్డి 175/175 స్థానాలు గెలుపే లక్ష్యంగా వెళ్తున్నారని, అందులో భాగంగా ఉత్తరాంధ్ర నుంచే ఎన్నికల శంఖారావం పూరించనున్నారన్నారు. ఈ సమావేశానికి భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్, మూడు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీకా కార్యక్రమం బలోపేతం చేయాలి

- డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్:టీకా కార్యక్రమం బలోపేతం చేసే దిశగా శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు స్థానిక ఎన్‌జీఓ సమావేశ భవనంలో వైద్యాధికారులకు టీకా కార్యక్రమంపై సోమవారం శిక్షణ నిర్వహించారు. విశాఖ జోన్ నుంచి వచ్చిన డబ్ల్యూహెచ్ఓ బృందం పవర్‌ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో డాక్టర్ జగన్నాథరావు పాల్గొని పలు సూచనలు చేశారు. టీకా కార్యక్రమానికి సంబంధించి వైద్య, ఆరోగ్య శాఖ సూచిస్తున్న మార్గదర్శకాలను కచ్చితంగా పాటించి క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా చూడాలని సూచించారు. వ్యాక్సిన్ నివారిత వ్యాధులు నియంత్రణకు ప్రభుత్వం పటిష్టంగా కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా తట్టు, రుబెల్లా వ్యాధులు ప్రబలకుండా శతశాతం వ్యాక్సినేషన్ జరగాలని చెప్పారు. ఓపీ నిర్వహణలో దద్దుర్లతో కూడిన జ్వరం, ఏఎఫ్‌పీ సమస్యలతో ఉన్నవారిని గుర్తించి వెంటనే సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని కోరారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయాలని, డ్రాపౌట్స్, లెఫ్ట్ అవుట్స్‌ను గుర్తించాలని కోరారు. టీకా మార్గదర్శకాలను పాటించి యువిన్ పోర్టల్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ నారాయణరావు, డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్ రావు, డీఎల్ఏటీఓ శ్యామ్‌కుమార్, డబ్ల్యూహెచ్ఓ ఎస్ఎంఓ జాన్‌జూడ్ జాషువా పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



చినభోగిలిలో ట్రాక్టర్‌తో రోడ్డుపై చెత్తను తొలిగిస్తున్న కార్యదర్శి మనోహర్



బగ్గందొరవలసలో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న కార్యదర్శి శ్రీనివాసరావు

సీతానగరం: ఉత్తరాంధ్ర భక్తులు ఇలవేల్పుగా పూజించే శంబర పోలమాంబ జాతరను పురస్కరించుకుని భక్తులు తిరుగాడే సీతానగరం మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయాగ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సీతానగరం మండలం చినభోగిలి మీదుగా మక్కువ మండలం శంబర జాతరకు వెళ్లే బీటీ రహదారిని ఆనుకుని ఉన్న చినభోగిలి, తామరఖండి, బగ్గందొరవలస గ్రామాల్లో రెండు రోజులుగా యంత్రాలు, కూలీలతో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. తొలగించిన చెత్తను దూర ప్రాంతాలకు తరలించి రోడ్డుకు ఇరు వైపులా బ్లీచింగ్ పౌడర్ జల్లిస్తున్నామన్నారు. అలాగే భక్తుల సేవార్థం గ్రామాల్లో ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. రోడ్డును ఆనుకుని ఉన్నగ్రామాల్లో మంచినీరు సౌకర్యం కల్పించామని, ఆర్టీసీ యాజమాన్యం భక్తులు రాకపోకలకు అనుకూలంగా బస్‌సౌకర్యం కల్పించిదన్నారు. కార్యక్రమాల్లో ఆయాగ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

40 మద్యం సీసాలు స్వాధీనం

పాలకొండ రూరల్: మండలంలో అంపిలి గ్రామినికి చెందిన వారణాశి మణికంఠ అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తుండగా స్థానిక పోస్టాఫీస్ రోడ్డులో సోమవారం పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద 40 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినటట్లు ఎస్సై హేమంత్‌కుమార్ తెలిపారు.

కుక్కకాటుతో పలువురికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: కుక్కకాటు బారినపడి పలువురు గాయపడిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. కేదారిపురంలో పసుపురెడ్డి పవిత్ర, పసుపురెడ్డి దివ్యశ్రీ, కొసగూడలో ఆరిక నందు, కురుపాం మండలంలోని జొంగరపాడులో మండంగి టుంబు, మూటక గాంధీలు గాయపడ్డారు. వీరిని వారి వారి గ్రామాల్లోని కుక్కలు దాడిచేయడంతో గాయపడగా, వైద్యసేవల నిమిత్తం వారంతా భద్రగిరి పీహెచ్‌సీలో చేరారు. వైద్యసిబ్బంది వారికి వైద్యం అందించారు.

ఆడుదాంఆంధ్రా విజేతలకు ప్రాక్టీస్ సామగ్రి



వాలీబాల్ విజేత లచ్చయ్యపేట జట్టు



ఖోఖో విజేత జోగింపేట జట్టు



బాడ్మింటిన్ విజేత పెదభోగిలి-1



క్రికెట్ విజేత జానుమల్లువలస టీమ్

సీతానగరం:మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో విజేతలందరూ నియోజకవర్గ స్థాయిల్లో జరగనున్న పోటీల్లో పాల్గొనడానికి సిద్ధం చేశామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ తెలియజేశారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మండల స్థాయిలో జరిగిన ఆడుదాం-ఆంధ్రా క్రీడల పోటీల్లో విజేతలకు ఆటలకు అవసరమైన కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రికెట్ పోటీల్లో జానుమల్లువలస, బాడ్మింటిన్‌లో పెదభోగిలి-1, కబడ్డీలో సూరంపేట, ఖోఖో జోగింపేట, వాలీబాల్ పోటీలో లచ్చయ్యపేట క్రీడాకారులు విజయం సాధించారని ప్రకటించారు. వారంతా నియోజకవర్గ స్థాయిలో త్వరలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారని, అందుకోసం వారికి ప్రాక్టీస్ చేయడానికి అవసరమైన క్రీడాసామగ్రిని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.



కబడ్డీ విజేత సూరంపేట క్రీడాకారులు

పనుల ప్రణాళికలో వార్డు మెంబర్లు కీలకమే

- జెడ్పీటీసీ రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: పంచాయతీ వార్షిక సంవత్సరానికి సంబంధించిన పనుల ప్రణాళిక తయారుచేసేటప్పుడు పంచాయతీ వార్డు మెంబర్లు కీలకపాత్ర ధారులేనని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ అన్నారు. ఈ మేరకు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వార్డు మెంబర్లు, వీఓఏలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల ప్రణాళిక తయారుచేసేటప్పుడు గ్రామస్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు వార్డు మెంబర్లు పంచాయతీలకు అవసరమైన పనులను ప్రతిపాదనలు చేయాలని సూచించారు. నాయకులతో చర్చించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మంచి పనులను గుర్తించడం వల్ల గ్రామానికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించుకోవడం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రజలకు అవసరమైన పనులను తెలుసుకుని వాటి ప్రతిపాదనలు పెట్టాలని అందుకు వార్డు మెంబర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

వికసిత్ భారత్ గ్రామసభల్లో
సంక్షేమపథకాలపై అవగాహన



సూరంపేట వైద్యశిబిరంలో రోగులను తనిఖీ చేస్తున్న వైద్యులు

సీతానగరం: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వికసిత్ భారత్ గ్రామసభల ద్వారా ప్రజలకు వివరిస్తూ, ఉచితవైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ తెలిపారు. ఈ మేరకు మండలంలోని సూరంపేటలో సోమవారం వికసిత్ భారత్ జిల్లా కోఆర్డినేటర్ రెడ్డి సింహాచలం ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న సంక్షేమపథకాల గురించి వివరించారు. గ్రామసభలు నిర్వహించే ప్రాంగణంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఉచితవైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఉచితవైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వైద్యసిబ్బంది, గ్రామవలంటీర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బడేవలసలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: మండలంలో పోలింగ్ కేంద్రాల పరిశీలన ముమ్మరంగా సాగుతోంది. అందులో భాగంగా బడేవలస, చెల్లెంపేట ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ-1సామల సింహాచలం సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సదుపాయం, తాగునీరు, ర్యాంప్, ఫ్యాన్లు, ఫర్నిచర్, తలుపులు, కిటికీలు తదితర మౌలిక సదుపాయాల కల్పన ఉందా లేదా అనేది తెలుసుకున్నారు. చెల్లెంపేట వద్ద కొత్తగా నిర్మించిన ర్యాంప్‌ను పరిశీలించారు. బడేవలస పాఠశాల వద్ద ఉండే అసౌకర్యాలను గుర్తించి వాటిని సరిచేయించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి అన్ని మౌలిక సదుపాయాల కల్పన సక్రమంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన యువత



వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులు

పార్వతీపురంటౌన్: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన యువత వైఎస్సార్‌సీపీలో భారీగా చేరుతున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం పట్టణంలోని 11, 12 వారులకు చెందిన యువతకు కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆయన అహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనకు మెచ్చి పార్టీపై నమ్మకాన్ని ఉంచి పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రానున్న కాలంలో సీఎంగా మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వార్డు కౌన్సిలర్‌లు రణభేరి చిన్నంనాయుడు, నిమ్మకాయల సుధీర్ కుమార్, పార్టీ నాయకులు బొచ్చ ఆనంద్, ఏఎంసీ వైస్‌చైర్మన్ వి.శంకర్రావు, సువ్వాడ శ్రీనివాసరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.